www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 12 డిసెంబర్ 2025

5

తిరుపతి

గతం కన్నా మిన్నగా శివరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

గతం కన్నా మిన్నగా మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక ఆలయ పరిపాలన భవనంలో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణపై గురువారం అధికారులు, ట్రస్ట్ బోర్డు సభ్యులతో తొలి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో కూలంకషంగా చర్చించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, ఈవో బాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో విద్యార్థుల పండుగ

నేటినుంచి ఎస్ఎఫ్ఐ 25వ రాష్ట్ర మహాసభలు

- నేడు మహాప్రదర్శన, బహిరంగసభ
- స్వాగత బ్యానర్లతో నిండిన నగరం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర 25వ రాష్ట్ర మహాసభలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ మహాసభలకు పాఠశాల నుంచి యూనివర్సిటీ వరకూ 26 జిల్లాల నుంచి 500 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. ఉదయం 9 గంటలకు ఎస్వి ఆర్ట్స్ కాలేజీ నుంచి ర్యాలీ ప్రారంభం కానుంది. బాలాజీ కాలనీ, మహతి సర్కిల్, జ్యోతి థియేటర్, స్విమ్స్ సర్కిల్ మీదుగా నెహ్రూ మున్సిపల్ హైస్కూల్‌కు చేరుకోనుంది. ఉదయం 11 గంటలకు బహిరంగసభ ప్రారంభం కానుంది. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిమంది హాజరుకానున్నారు. అఖిల భారత అధ్యక్ష కార్యదర్శులు ఆదర్శ్ ఎం.సాజి, శ్రీజన్ భట్టాచార్య, మాజీ అధ్యక్షులు వై.వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించనున్నారు. సాయంత్రం 4 గంటలకు తిరుపతి కచ్చపి ఆడిటోరియంలో ప్రతినిధుల సభ ప్రారంభం కానుంది. ముఖ్య అతిథులుగా తమిళనాడు హైకోర్టు మాజీ జస్టిస్ కె.చంద్రు, జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ హాజరుకానున్నట్లు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అక్బర్, భగత్‌రవి తెలిపారు. 40 ఏళ్ల తరువాత తిరుపతిలో జరగనున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలకు ఎస్ఎఫ్ఐ అధినాయకత్వం ఏర్పాట్లలో తలమునకలయ్యింది. సభల విజయవంతానికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ముద్రించి ఆవిష్కరించారు. నగర నలుమూలల ఎస్ఎఫ్ఐ బ్యానర్లు ప్రతినిధులకు స్వాగతం పలుకుతున్నాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ ప్రతినిధుల సభలో జాతీయ నూతన విద్యా విధానం పేదలకు ఏ విధంగా విద్య దూరమవుతుంది? వ్యతిరేకంగా చేయాల్సిన పోరాటాలు రూపుదిద్దుకోనున్నాయి. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రధానంగా తీర్మానం చేయనున్నారు.సంక్షేమ హాస్టళ్లను రాష్ట్ర ప్రభుత్వం గాలికొదిలేసిన తీరును ఎండగట్టనున్నారు. 'డ్రగ్స్ అంతం.. ఎస్ఎఫ్ఐ పంతం' అనే కీలక నినాదంతో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభ తిరుపతి ఆధ్యాత్మిక ప్రాంతం నుంచి పిలుపు ఇవ్వనుంది. ఇప్పటికే రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పి.రామ్మోహన్, కె.ప్రసన్నకుమార్‌లు తిరుపతికి విచ్చేసి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేసి బలైపోయిన పెంచలయ్య అఖండ జ్యోతి నెల్లూరు అయ్యప్పగుడి నుంచి ప్రారంభమై గురువారం సాయంత్రం 5.30 గంటలకు కచ్చపి ఆడిటోరియానికి చేరుకుంది. రాష్ట్ర, జిల్లా నాయకత్వం ఈ జ్యోతిని ఉద్యమ స్ఫూర్తితో అందుకున్నారు. 'అమర్‌హే' పెంచలయ్య అంటూ నినదించారు.

రాష్ట్ర మహాసభలకు కచ్చపి ఆడిటోరియం సిద్ధం

మహంతు... ఇదేం తంతు..!

దారితప్పిన దుకాణాల వేలం ప్రక్రియ
హాథీరాంజీ మఠానికి కోట్లల్లో బకాయిలు
మూడు దుకాణాలను సీజ్ చేసిన అధికారులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుమల శ్రీవారికి పరమ భక్తుడైన శ్రీ స్వామి హథీరాంజీ మఠంకు చెందిన దుకాణాల నిర్వహణ దారితప్పింది.. బతుకుతెరువు నిమిత్తం మఠం అధికారులు ద్వారా నిర్వహించిన వేలంలో షాపులను నెలసరి అద్దె ప్రతిపాదికన పొందిన కొంతమంది వ్యక్తులు మఠం అధికారులతో లాలూచీ పడ్డారని తెలుస్తోంది. గతంలో మఠం పరిపాలన బాధ్యతలు నిర్వర్తించిన మహంతు అర్జున్ దాస్, ఆయన బంధువు అధికారిగా చలామణి అయిన మిశ్రా తీసుకున్న చర్యల కారణంగా శ్రీ స్వామి హథీరాంజీ మఠం నేడు రెవెన్యూ లోటును చవి చూస్తోంది. నిబంధనల ప్రకారం జరగాల్సిన వేలం ప్రక్రియ జరగకపోవడంతో గతంలో దుకాణాలు పొందిన కొంతమంది మఠంకు కట్టాల్సిన అద్దె బకాయిలు కట్టకపోవడంతో నేడు మఠం అధికారులు వేసిన వడ్డీతోపాటు కోట్ల రూపాయలకు చేరిపోయాయి. అద్దె బకాయిలు చెల్లించాలంటూ మఠం అధికారులు ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చిన జవాబులు ఇవ్వకుండా రాజకీయ అండదండలతో ఇన్నాళ్లు కొనసాగుతూ వచ్చారు. నేడు కోట్ల రూపాయలు దుకాణదారులు చేతిలో అద్దె బకాయిలు మిగిలిపోవడంతో మఠం అధికారులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులు సైతం పాటించకుండా ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు కొంతమంది దుకాణదారులు.

2018లో వేలం కాలం పూర్తయినా...

2018కి మూడేళ్ల ముందు వేలం ప్రక్రియ ద్వారా దుకాణాలు పొందిన వారు అటు తరువాత తమ గడువు పూర్తయిన నేపథ్యంలో 2019లో కరోనా పాండమిక్ రావడంతో మఠం అధికారులకు కట్టాల్సిన బకాయిలను చెల్లించకపోగా మఠం అధికారుల ద్వారా సీజ్ చేయబడిన షాపులను దౌర్జన్యంగా తాళాలు పగలగొట్టి నేటి వరకు అనుభవించిన పరిస్థితి. 2022లో కోవిడ్ పాండమిక్ ముగిశాక తిరిగి మళ్లీ మఠం దుకాణాలకు వేలం ప్రక్రియ నిర్వహించాల్సి ఉండగా తిరుపతి నగరపాలక సంస్థ మఠం భవనం శిథిలావస్థకు చేరిందని, ఇప్పట్లో దుకాణాలకు సంబంధించి ఎటువంటి వేలం ప్రక్రియను నిర్వహించ రాదని నోటీసులు ఇచ్చారు. అటు తరువాత మఠం అధికారులు దౌర్జన్యంగా తాళాలు పగలగొట్టిన వారిపై తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్లో కేసులు నమోదు చేశారు.

62 షాపులకు నిర్వహించిన వేలంలో....

2018 తర్వాత 62 షాపులకు మఠం అధికారులు వేలం నిర్వహించాల్సి ఉండగా అద్దెలు సక్రమంగా చెల్లించిన 50 దుకాణాలకు చెందిన వారు తిరిగి షాపులు మాకే ఇవ్వాలని కోరగా ఈ 50 దుకాణాలకు మాత్రమే వేలం ప్రక్రియ నిర్వహించారు. మిగిలిన 12 మంది దుకాణదారులు మఠంకు అద్దె బకాయిలు సక్రమంగా చెల్లించకపోగా మూడేళ్ల కాలం తమకే ఇవ్వాలని కోరగా, ఎండోమెంట్ కమిషనర్ ఉత్తర్వుల ప్రకారం బకాయి పడ్డ మొత్తాన్ని చెల్లిస్తే వారికే కేటాయించే విధంగా ఆదేశాలు ఇచ్చారు. అయితే మఠం అధికారులు బకాయి ఉన్న దుకాణదారులకు ఏడాదికి 35 శాతం వడ్డీతో కలిపి అద్దె చెల్లించాలని నోటీసులు ఇచ్చారు. నోటీసులు అందుకున్న దుకాణదారులు వాయిదాల పద్ధతిలో వీటిని చెల్లిస్తామని రాతపూర్వకంగా మఠం అధికారులకు లేఖలు ఇచ్చారు.

మార్కు చేసిన షాపులకు లాక్....

మఠం ఉత్తరభాగ భవనం శిథిలావస్థకు చేరడంతో ఇటీవల జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశాలతో స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ విజయవాడ, ఐఐటి తిరుపతి వారి నివేదికల ఆధారంగా మఠం మండువా భవనం ఏ ప్రదేశాల్లో అయితే శిథిలావస్థకు చేరిందో అక్కడ మార్క్ చేశారు. ఇటీవల జరిగిన డీఆర్సీ సమావేశంలో కూడా మఠం పరిస్థితిని జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ సమక్షంలో చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో మార్క్ చేసిన ప్రాంతంలో ఉన్న వేణుగోపాల్ నాయుడు, రాజేష్, సిద్దయ్య షాపులకు సంబంధించి మఠం అధికారులు సీజ్ చేశారు. ఎలాగో దుకాణాన్ని తొలగిస్తారని తెలుసుకున్న వేణుగోపాల్ నాయుడు తాను మఠం అధికారులకు కట్టాల్సిన రూ.82, 89, 976 చెల్లించాల్సి వస్తుందోనని ముందుగానే షాపులో ఉన్న సరుకులను వేరొక చోటుకు మార్చి సీజ్ చేసిన షాప్ మార్చబడిన అడ్రస్సును తెలుపుతూ బ్యానర్ను ఏర్పాటు చేసుకున్నాడు. అలానే దుకాణదారుడు రాజేష్ రూ.32,88,000 లక్షలు, సిద్దయ్య రూ.68,79,000 లక్షల రూపాయలు మఠం అధికారులకు బకాయిలుగా ఉన్నట్లు తెలుస్తోంది.

ఆర్ఆర్ యాక్ట్ ప్రకారం వసూలు చేస్తాం :కేశవులు, పర్యవేక్షణ అధికారి, శ్రీ స్వామి హథీరాంజీ మఠం

మఠం ద్వారా దుకాణాలు పొంది అద్దెలు చెల్లించకుండా ఉన్న దుకాణదారుల నుండి రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం అద్దెలు వసూలు చేస్తాం. మఠం పరిపాలన అధికారి బాపిరెడ్డి సూచనల మేరకు ఇప్పటికే కోర్టులో అరియర్స్ రికవరీ కేసును వేశాం. ఎప్పటికైనా మఠంకు బకాయి పడ్డ అద్దెలు వడ్డీతో సహా చెల్లించాల్సిందే.

ప్రభుత్వ సాయం నామమాత్రం అంటూ కళత్తూరు నిర్వాసితుల ఆవేదన

కళత్తూరు బాధితులను ఆదుకోండి : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

కెవిబి పురం మండలంలోని కళత్తూరు గ్రామస్తులు సర్వస్వం కోల్పోయి నెల రోజులు దాటుతున్నప్పటికీ నష్టపరిహారం చెల్లించకపోవడం దారుణమని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మండిపడ్డారు. కళత్తూరు బాధితులు గురువారం కలెక్టర్‌ను కలిసి తమకు పరిహారం సక్రమంగా అందలేదని, ఇచ్చిన పరిహారం ఏమాత్రం సరిపోదని తెలియజేస్తూ వినతి పత్రాన్ని ఇచ్చారు. ప్రభుత్వం ప్రకటించిన పదివేల రూపాయల నష్టపరిహారం ఏ మూలకూ సరిపోదన్నారు. కనీస పరిహారంగా మూడు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేమన విజ్ఞాన కేంద్రంలో కళత్తూరు యువకులు సిపిఎం నాయకత్వాన్ని కలిసి తమ బాధలను వివరించారు. సిపిఎం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. శాశ్వత పరిష్కారంగా ఇళ్లస్థలాలు కేటాయించడమే గాకుండా, సాగుభూమికి గతంలో ఇచ్చిన పట్టాలను ఫారెస్టు నిబంధనల నుంచి విముక్తి కలిగించాన్నారు. చదువుకున్న యువతకు ఉపాధి కలిగించడానికి నైపుణ్య శిక్షణ ఇచ్చి పరిశ్రమలలో అవకాశం కల్పించాలని కోరారు. ఇసుక మేటలతో నిండిపోయిన భూములను ప్రభుత్వమే తన ఖర్చుతో బాగు చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పశువులు ఇతర వాటిని కోల్పోయిన నష్టాన్ని శాస్త్రీయంగా అంచనా వేయాలని ఆయన తెలిపారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్ధన్, నాయకులు ఆర్ వెంకటేష్, పి హేమలత, పి గురవయ్య పాల్గొన్నారు.

కనీస వేతనం 26వేలు ఇవ్వాలి

నేడు కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల భారీ ధర్నా

ప్రజాశ -తిరుపతి టౌన్

అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలివ్వాలని, సుప్రీం తీర్పు ప్రకారం వేతనాలు అమలు చేయాలని, సంక్షేమ పథకాలు ఇవ్వాలని, అన్ని రకాల యాప్‌లను ఒకే యాప్‌గా తీసుకురావాలన్న ప్రధాన డిమాండ్లతో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా జరగనుందని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వాణిశ్రీ, ఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షురాలు భారతి, సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్.జయచంద్ర, టి.సుబ్రమణ్యం, తిరుపతి ప్రాజెక్టు కార్యదర్శి నాగరాజమ్మ, నాగరత్నమ్మ వెల్లడించారు. ఈ మేరకు సిఐటియు జిల్లా కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులకు వేతనాల పెంపు, గ్రాడ్యుటీ సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమయ్యిందన్నారు. సమ్మె సమయంలో ప్రతిపక్షంలో ఉన్న టిడిపి కూటమి నాయకత్వం అంగన్‌వాడీ సమ్మెను బలపరిచిందన్నారు. తమ డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పూర్తయినా ఇప్పటివరకూ ఒక్క సమస్యా పరిష్కారం కాలేదన్నారు. 2019 నుంచి అంగన్‌వాడీలకు ఒక్క రూపాయి వేతనం పెంచలేదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు, విద్య, వైద్యం ఖర్చులు విపరీతంగా పెరిగాయన్నారు. వర్కర్లపై పనిభారం పెరిగిందన్నారు.

పని ఒత్తిడితో అంగన్‌వాడీలు మానసికంగా కుంగిపోతున్నారన్నారు. ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేసేలా కేంద్రం కుట్ర పన్నుతోందన్నారు. భారతదేశంలో ఆరేళ్ల లోపు ఉన్న పిల్లలు 37 శాతం మంది ఎదుగుదల లోపంతో ఉన్నారని, 17శాతం పిల్లలు తక్కువ బరువుతో ఉన్నారన్నారు. ఆహారం అందక ఐదేళ్ల లోపు పిల్లలు 8.5 లక్షల మంది మరణిస్తున్నారన్నారు. కేంద్రం కేటాయించిన 21 కోట్ల 960 లక్షల నిధులు ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. అంగన్‌వాడీల సమస్యలపై కలెక్టరేట్ ఎదుట శుక్రవారం జరగనున్న మహాధర్నాకు వేలాదిమంది తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

తిరుమలలో ప్రయోగాత్మకంగా రిసైకిల్ మిషన్లు

ప్రజాశక్తి -తిరుమల

తిరుమలలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా రిసైకిల్ మిషన్ల ఏర్పాటుపై గురువారం తిరుమలలోని పద్మావతి అతిథి గహంలో టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ నెలలో ప్రయోగాత్మకంగా తిరుమలలోని యాత్రికుల వసతి సముదాయం-5 లో ఏర్పాటు చేసిన రెక్లెయిమ్ డిపాజిట్ రీఫండ్ మిషన్లకు విశేష స్పందన రావడంతో తిరుమలలో ఈ మిషన్లను మరి కొన్నింటిని పరిశీలనాత్మకంగా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. తిరుమలలో టెట్రాపాక్, టిన్ లలో పానీయాలను స్వీకరించిన అనంతరం భక్తులు ఎక్కడంటే అక్కడ పడేయకుండా ఈ డిపాజిట్ రీఫండ్ మెషిన్ల లో వేస్తే తిరుమలలో పరిశుభ్రత మరింత మెరుగు పడేందుకు దోహదపడుతుందని ఆయన అన్నారు. ఈ విషయం పై తిరుమలలోని వ్యాపారులు, టెట్రా ప్యాక్ డీలర్లు కూడా తోటి వారిలో అవగాహన కల్పించాలని కోరారు. స్వచ్ఛ తిరుమలలో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేయడంలో భాగంగా ఒక ఉద్యమంలా రెక్లైమ్ రీసైకిల్ మెషిన్లపై భక్తులకు విస్తతంగా అవగాహన కల్పించి తిరుమలలోని ముఖ్యమైన ప్రాంతాల్లో మరిన్ని మెషిన్ల ఏర్పాటు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను అదనపు ఈవో ఆదేశించారు.ఈ సమావేశంలో డీఎఫ్ఓ ఫణి కుమార్ నాయుడు, డిప్యూటీ ఈవోలు సోమన్నారాయణ, వేంకటేశ్వర్లు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మధు సూదన్, డిప్యూటీ ఈఈ శ్రీనివాస్, రెక్లైమ్ రీసైకిల్ సంస్థ ప్రతినిధులు కిరణ్, రవి పాల్గొన్నారు.

శ్రీవారి చుట్టూ 'స్కాంలు'

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

మొన్నామధ్య కల్తీ నెయ్యి కలకలం... నిన్నటికి నిన్న పరకామణి చోరీ వ్యవహారం.. ఇప్పుడేమో పట్టువస్త్రం పేరుతో కుంభకోణం.. ఇలా కొండచుట్టూ స్కామ్‌లు జరుగుతుండటం కలవరపెడుతోంది. స్వామివారి పట్టు వస్త్రాల కొనుగోళ్లలో పెద్దఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని టీటీడీ ఓ అంచనాకొచ్చింది. పట్టు వస్త్రాలతో పాటు.. దాతలు, విఐపిలకు బహూకరించే పట్టు శాలువాల కొనుగోళ్లలో అవినీతి జరుగుతోందని చెబుతోంది. పట్టు పేరుతో పాలిస్టర్ వస్త్రాలను అంటగడుతూ.. సంవత్సరం కాదు రెండు సంవత్సరాలు కాదు 2010 నుంచి ఈ దందా నడుస్తోందని ఆరోపించింది. అసలది పట్టే కాదు అంతా వట్టిదేనన్న అంశం రెండు నెలల క్రితం జరిగిన బోర్డు మీటింగ్‌లోనే చర్చకొచ్చిందని.. ఓ క్లారిటీ వచ్చాకే బయటపెట్టాలనుకున్నామని తెలిపింది. 350-400 రూపాయల విలువచేసే ఒక్కో పట్టు శాలువాని 14 వందల రూపాయలకు అమ్ముతున్నట్లు ప్రాథమికంగా నిర్ధారించింది. ఇప్పటిదాకా 54 కోట్ల అవినీతి జరిగిందని చెబుతుంది. విజిలెన్స్ నివేదిక ఆధారంగా కేసు దర్యాప్తును ఏసీబీకి అప్పగించాలని టీటీడీ బోర్డు నిర్ణయించింది.

గత సెప్టెంబర్‌లో టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు కొనుగోలు చేసిన వస్త్రాలే ఈ స్కామ్ బయటకు రావడానికి కారణం. బీఆర్ నాయుడు టీటీడీకి వస్త్రాలు సరఫరా చేస్తున్న ఏజెన్సీ ద్వారానే తన అవసరం మేరకు కొనుగోలు చేశారు. ఒక్కో వస్త్రాన్ని రూ. 350 లకు కొన్నారు. దీంతో నాణ్యత పై అనుమానం రావడంతో సెప్టెంబర్ 16న జరిగిన పాలకమండలి సమావేశంలో ఈ అంశాన్ని చర్చించి.. నివేదిక ఇవ్వాలని విజిలెన్స్‌ను ఆదేశించారు. విజిలెన్స్ అధికారులు తిరుమలలోని వైభవోత్సవ మండపం, తిరుపతిలోని మార్కెటింగ్ విభాగం నుంచి ఒక్కోచోట రెండేసి వస్త్రాల శాంపిల్స్‌ను సేకరించారు. ఈ శాంపిల్స్‌ను ధర్మవరం, బెంగళూరులోని సెంట్రల్ సిల్క్ బోర్డుకు నాణ్యత పరీక్షల కోసం పంపారు. సెంట్రల్ సిల్క్ బోర్డు ఇచ్చిన శాంపిల్స్ రిపోర్ట్ టీటీడీ నిబంధనలను తీవ్రంగా అతిక్రమించినట్లు తేల్చింది.

టెండర్ నియమాల ప్రకారం వస్త్రాలను స్వచ్ఛమైన మల్బరీ పట్టుతో నేయాలి. కనీసం 31.5 డెనియర్ నూలును ఉపయోగించాలి. ప్రతి శాలువాపై ఒకవైపు సంస్కృతంలో, మరోవైపు తెలుగులో ఓం నమో వేంకటేశాయ అని.. శంకుచక్రం, నామం చిహ్నాలు ఉండాలి. ఇక శాలువా పరిమాణం, బరువు, బార్డర్ రూపకల్పనను టెండర్‌లో స్పెషల్‌గా మెన్షన్ చేస్తారు. ఇప్పుడీ నిబంధనలనే విఆర్ఎస్ ఎక్స్‌పోర్ట్స్ సంస్థ గాలికొదిలేసిందని టీటీడీ ప్రధాన ఆరోపణ. పట్టుకు బదులు పూర్తి పాలిస్టర్‌తో వస్త్రాలను తయారు చేసి.. టీటీడీనే కాదు భక్తులనూ మోసం చేస్తున్నారని బోర్డు మెంబర్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2015 నుంచి 2025 వరకు దాదాపు రూ. 54.95 కోట్ల విలువైన వస్త్రాలను పంపిణీ చేసిన నగరి సమీపంలోని విఆర్ఎస్ ఎక్స్పోర్ట్స్, దాని అనుబంధ సంస్థలైన తిరుమల ఫ్యాబ్రిక్స్, వీఎం రాజా పవర్ లూమ్ యూనిట్లపై బోర్డు చర్యలు తీసుకుంది. తిరుపతిలోని మార్కెటింగ్ విభాగం నుంచి సేకరించిన శాంపిల్ వస్త్రాలకు కాంచీపురం సెంట్రల్ సిల్క్ బోర్డు అప్రూవల్ ఇవ్వడంపై టీటీడీ విజిలెన్స్‌కు అనుమానం వచ్చింది. ల్యాబ్‌లో అవకతవకలు జరిగి ఉంటాయన్న అనుమానంతో దర్యాప్తు కొనసాగుతోంది.

ప్రస్తుతం టీటీడీ వద్ద 15 రోజులకు సరిపడా వస్త్రాలు అందుబాటులో ఉన్నందున, భక్తులకు ఇబ్బంది లేకుండా ప్రస్తుతం ఉన్న వస్త్రాలనే వేదాశీర్వచనంలో వినియోగిస్తున్నట్లు సమాచారం. ఈ అవినీతిపై పూర్తిస్థాయి విచారణ మరింత మంది అధికారుల పాత్రను బయటపెట్టే అవకాశం ఉందని తెలుస్తోంది.

అంగన్‌వాడీలకు శాంసంగ్ 5జీ మొబైల్స్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్ధవంతంగా అమలు చేయడంలో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలకు నూతన శాంసంగ్ 5జి మొబైల్స్‌ను కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ గురువారం అందించారు. సచివాలయంలోని సమావేశ మందిరంలో 2,492 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు, 97 మంది సూపర్‌వైజర్లకు, 12 మంది బ్లాక్ కో-ఆర్డినేటర్లకు నూతన శాంసంగ్ 5జి మొబైల్ ఫోన్లను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులు, గర్భిణీస్త్రీలు, పాలిచ్చే తల్లులకు సంబంధించిన వివరాల నమోదుకు ఈ మొబైల్స్ ఉపయోగపడతాయన్నారు. ఒక్కో మొబైల్ ఫోన్ ధర రూ.14వేలని,మొత్తం 2,601 మొబైల్స్‌కు దాదాపు రూ.3.64 కోట్లు ఖర్చు అయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖాధికారి వసంతబాయి, జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు,నోడల్ ఆఫీసర్ వాసంతి పాల్గొన్నారు.

శ్రీసిటీ ఫేజ్-2 భూసేకరణ వేగవంతం : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

శ్రీసిటీ ఫేజ్ -2 సంబంధించి భూసేకరణ పనులు వేగవంతం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో శ్రీసిటీ ఫేజ్ -2 సంబంధించి వెబ్‌ల్యాండ్, ఎల్‌జి ఫేజ్ -1, 2 పెండింగ్ భూసేకరణ పనులు, కోర్టు కేసులు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. పెండింగ్ కోర్టు కేసులు త్వరగా పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షీ, సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయ్, శ్రీసిటీ జనరల్ మేనేజర్ భగవాన్, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ విజయ్ భరత్‌రెడ్డి పాల్గొన్నారు.

స్థానికులకు 'ఈ-డిప్'లో వైకుంఠ ద్వార దర్శనం టోకెన్లు

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబర్ 30 నుండి జనవరి 8వ తేది వరకు నిర్వహించనున్న వైకుంఠ ద్వార దర్శనాల్లో జనవరి 6, 7, 8 తేదీల్లో రోజుకు 5వేల టోకెన్ల చొప్పున తిరుమల, తిరుపతి, రేణిగుంట, చంద్రగిరి ప్రాంతాల వారికి స్థానికుల కోటా కింద కేటాయించాలని టీటీడీ నిర్ణయం తీసుకున్న విషయం విదితమే. డిసెంబర్ 27వ తేది ఉదయం 10 నుండి 29 వ తేది సాయంత్రం 5 గంటల వరకు ఈ- డిప్ నమోదుకు టీటీడీ అవకాశం కల్పించనుంది. తిరుమల, తిరుపతి, రేణిగుంట, చంద్రగిరికి చెందిన స్థానికులు పైన పేర్కొన్న తేదీల్లో 1+3 విధానంలో ఈ-డిప్ కోసం టీటీడీ వెబ్ సైట్, మొబైల్ యాప్, వాట్సాప్ ద్వారా నమోదు చేసుకోవచ్చు.డిసెంబర్ 31న మధ్యాహ్నం 2 గంటలకు ఈ-డిప్ ద్వారా టోకెన్లు కేటాయించడం జరుగుతుంది. ఇందులో రోజుకు తిరుపతి, రేణిగుంట, చంద్రగిరి స్థానికులకు 4500, తిరుమల స్థానికులకు 500 టోకెన్లు చొప్పున కేటాయించనున్నారు.ఈ విషయాన్ని గమనించి స్థానికులు టోకెన్ల కోసం ఈ-డిప్ ద్వారా నమోదు చేసుకోవాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తుంది.

టీటీడీ చైర్మన్‌ను కలిసిన శ్రీశైలం దేవస్థానం బోర్డు చైర్మన్

టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడును శ్రీశైలం దేవస్థానం బోర్డు చైర్మన్ పి.రమేష్ నాయుడు, బోర్డు సభ్యులు హైదరాబాద్ లోని టీటీడీ చైర్మన్ వ్యక్తిగత కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా శ్రీశైలం దేవస్థానం అభివద్ధికి టీటీడీ సహకారం అందించాలని టీటీడీ చైర్మన్ కు విజ్ఞప్తి చేశారు. శ్రీశైలంలో కాటేజీల నిర్మాణానికి సాయం అందించాలని కోరారు. ఈ విషయంపై టీటీడీ బోర్డు సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని టీటీడీ చైర్మన్ శ్రీశైలం దేవస్థానం చైర్మన్ కు తెలియజేశారు.అనంతరం టీటీడీ చైర్మన్ కు శ్రీశైలం దేవస్థానం బోర్డు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల స్పెషల్ క్యాంప్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక పురపాలక సంఘ పరిధి, పిల్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గురువారం స్పెషల్ క్యాంప్ నిర్వహించారు. జెడ్పీయచ్ఎస్ పాఠశాలలో కార్యక్రమం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ఎస్వీ కుమార్ తెలిపారు. ఈసందర్భంగా పాఠశాల హెడ్మాస్టర్ ఈశ్వర్ కుమార్ ఎన్ఎస్ఎస్‌లో వాలంటీర్లను అభినందించారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల పరిసర ప్రాంతాలలోని పిళ్ళారిపట్టు, బందరుపల్లి, చౌటూరు, తాయిలంమాంబపురం, నేసనూరు, పిల్లారిపట్టు హరిజనవాడ, గణపతి నగర్ తదితర ప్రాంతాల గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రత, సూపర్ జీఎస్టీ వంటి వాటిపై అవగాహన కల్పించారు. చివరగా వాలంటీర్లకు క్యాంపు సర్టిఫికేట్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు కిషోర్ కుమార్, అమర్నాథ్, వేలాయుదాచారి, ప్రోగ్రామ్ ఆఫీసర్ సాగర్ రెడ్డి, అధ్యాపకులు, ఎన్ ఎస్ఎస్ వాలంటీర్లు, జెడ్పీ హెచ్ విద్యార్థులు పాల్గొన్నారు.

యూటిఎఫ్ నూతన కార్యవర్గం ఎంపిక

యూటిఎఫ్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎం.రాజేష్, జనరల్ సెక్రటరీ పివిఎస్ఎన్ రాజు

ప్రజాశక్తి-రామచంద్రపురం: రామచంద్రపురంమండల యూటిఎఫ్ కౌన్సిల్ అధ్యక్షుడిగా ఎం.రాజేష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం కమ్మ కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ నూతన కార్యవర్గ ఎంపిక సమావేశం జరిగింది. గౌరవ అధ్యక్షులుగా వై.జగన్నాథం, జనరల్ సెక్రటరీగా పివిఎస్ఎన్ రాజు, ఉపాధ్యక్షులుగా సిజి.పరమేశ్వరి, యంవి రామకృష్ణ , కోశాధికారిగా పి.హరికృష్ణారెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల రెడ్డి, రాష్ట్రకార్యవర్గ సభ్యులు దేవరాల నిర్మల, గౌరవ అధ్యక్షులు దండు రామచంద్రయ్యలు హాజరయ్యారు. ఎన్నికల అధికారులుగా, జిల్లా కార్యదర్శి అవనిగడ్డ పద్మజ, మండల కుటుంబ సంక్షేమ పథకం డైరెక్టర్ నాగేశ్వర నాయుడు వ్యవహరించారు. ఈ కార్యవర్గ ఎంపిక సమావేశంలో 50 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఎం.రాజేష్, జనరల్ సెక్రటరీ పి.వి.ఎస్.ఎన్ రాజులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం నూతన కౌన్సిల్ సభ్యులను సన్మానించి, అభినందనలు తెలియజేశారు.

రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాలపేట మండలం, వడమాలపేట-గొళ్లకండ్రిగ నుండి ఓ.బి.ఆర్ కండ్రిగ మీదుగా కుప్పంబాదురు రోడ్డు వరకు వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారింది. రోడ్డుపై గతుకులు ఏర్పడడంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ సమస్యను పంచాయతీ ప్రజలు గ్రీవెన్స్‌లో నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో కూటమి ప్రభుత్వం తారు రోడ్డు నిర్మాణానికి రూ. 2.28 కోట్లు మంజూరు చేసింది.

బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి

ప్రజాశక్తి - రామచంద్రపురం : రాష్ట్రంలోని ఫార్మసీ కళాశాలల్లో ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ హాజరు విధానాన్ని తప్పకుండా పాటించాలని ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు డాక్టర్ యం.సిరంజన్ బాబు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని, వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాలలో, ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, న్యూ ఢిల్లీ ఆధ్వర్యంలో ఆధార్ ఎనేబుల్డ్ బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టమ్ (ఏఈబిఏఎస్)పై ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, నోడల్ అధికారులకు ప్రత్యేక ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాకల్టీ ఐడి ఆధారిత ధ్రువీకరణను, బయోమెట్రిక్ మిషన్లు డిసెంబర్ 31 లోగా నమోదు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ జషు భాయ్, హిరాభాయ్ చౌదరి రాజులు, కౌన్సిల్ ఐ.టి. ఛైర్మన్ సత్యమూర్తి, ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, నోడల్ ఆఫీసర్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఆలయ సెక్యూరిటీ నిజాయితీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయ సెక్యూరిటీ విభాగంలో పనిచేస్తున్న నీలా, ఓ భక్తుడు పోగొట్టుకున్న పర్సును తిరిగి అందజేసి నిజాయితీని చాటుకున్నారు. గుంటూరు పట్టణానికి చెందిన అన్నం మురళి కుటుంబం గురువారం కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి చేరారు. దర్శనానంతరం క్యూలైన్లో వస్తుండగా మురళి పర్సు కింద జారి పడిపోయింది. ఆలయంలో సెక్యూరిటీ విధులు నిర్వహిస్తున్న నీలా పర్సును గుర్తించి ఎస్పీఎఫ్ సిబ్బందికి సమాచారం అందించింది. వారి సాయంతో సదరు భక్తుడికి పర్సును తిరిగి అప్పగించారు. పర్సులో రూ.50 వేలు ఉన్నాయని, నిజాయితీ, మానవత్వంతో వ్యవహరించిన సెక్యూరిటీ నీలాను సదరు భక్తుడి కుటుంబం అభినందించింది.

ఏర్పేడు ఎంపీపీ పదవి టీడీపీ కైవసం

ప్రజాశక్తి-ఏర్పేడు: ఏర్పేడు ఎంపీపీ పదవిని టిడిపి కైవసం చేసుకుంది. గత ప్రభుత్వంలో ఏకగ్రీవంగా ఎంపికైన పల్లంకి చెందిన పొన్నూరు గీత రాజీనామా చేయడంతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు వైస్ ఎంపీపీగా వున్న జమ్మల శ్రీనివాస్ యాదవ్ మూడు నెలలు ఎంపీపీగా బాధ్యతలు నిర్వహించారు. ఏర్పేడు మండలంలో 16 మంది ఎంపీటీసీ సభ్యులుండగా ఎంపీపీ స్థానం గిరిజన మహిళ కేటగిరీకి రాష్ట్ర ఎన్నికల సంఘం గతంలో కేటాయించింది. మూడు గిరిజన మహిళ ఎంపీటీసీ స్థానాలు ఉన్నప్పటికీ ఏకగ్రీవంగా పొన్నూరు గీత ఎంపీపీ పదవి దక్కించుకుంది. కందాడుకు చెందిన ఎంపీటీసీ సభ్యురాలు జి.రేవతి మృతి చెందింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎంపీపీ గీత రాజీనామా చేశారు. 2024 ఎన్నికల సమయంలో వైసీపీకి చెందిన జడ్పిటిసి, ముగ్గురు ఎంపీటీసీ సభ్యులు టిడిపిలో చేరారు. వీరిలో పంగూరుకు చెందిన పి.ఆదిలక్ష్మి గిరిజన మహిళ కావడంతో గురువారం ఎంపీపీ పదవి ఆమెకు ఏకగ్రీవమయింది. ఆరుగురు వైసిపి ఎంపీటీసీ సభ్యులు గురువారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరి, ఆదిలక్ష్మికి మద్దతు పలికారు. ఎమ్మెల్యే, ఎంపీడీవో సౌభాగ్యమ్మ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నికైన ఎంపీపీ ఆదిలక్ష్మికి నియామక పత్రం అందజేశారు.

జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - క్యాంపస్ : 19వ తేదీ నుండి 23వ తేదీ వరకు రాజస్థాన్‌లో జరుగు జాతీయ బ్లైండ్ జూడో ఛాంపియన్ షిప్ పోటీలకు శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలకు చెందిన ఐదుగురు దృష్టి లోపం ఉండి, ప్రత్యేక సామర్థ్యాలు కలిగిన విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని ప్రిన్సిపాల్ ప్రకాష్ బాబు అభినందించారు. యశ్వంత్ రెడ్డి, బి.అంజి, ఎమ్.అంజి, వి. నవీన్, ఏ.జీవన్ బాబు తిరుపతిలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

జాతీయ రహదారులపై భద్రతా ప్రమాణాలు పెంచాలి : ఎంపీ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: దేశంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గత ఐదేళ్లలో జరిగిన రోడ్డు ప్రమాదాల తీరు, నివారణ చర్యలు, హైవే ట్రామా కేర్ సెంటర్లు, గోల్డెన్ అవర్ వైద్య సహాయంపై ఎంపీ అడిగిన ప్రశ్నలకు కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సమాధానమిచ్చారు. ప్రమాదాల నివారణకు 4ఇ విధానం (ఎడ్యుకేషన్, ఇంజినీరింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎమర్జెన్సీ కేర్) అమలు చేస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా 196 ట్రామా కేర్ సెంటర్లను ఆమోదించామన్నారు. ఎంపీ ప్రతిస్పందిస్తూ అతి వేగం, స్పీడ్ డిటెక్షన్ సిస్టమ్‌ల పనితీరుపై అనుమానం వ్యక్తం చేశారు. టోల్‌ప్లాజాల వద్ద అంబులెన్స్‌లు సక్రమంగా లేవని తెలిపారు. అత్యవసర సేవలను రియల్ టైమ్ మానిటరింగ్‌చేయాలన్నారు.

ఏపీలో వైద్య విద్యా రంగాన్ని కాపాడాలి

ఆంధ్రప్రదేశ్‌లో వైద్య విద్యా రంగంలో నెలకొన్న ప్రస్తుత సంక్షోభంపై తిరుపతి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మద్దిల గురుమూర్తి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంటు సమావేశాలలో బాగంగా మంగళవారం అత్యంత ముఖ్యమైన ప్రజా సమస్యలు ప్రస్తావించే అధికరణ 377 కింద రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అంశాన్ని ప్రస్తావించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేయాలనే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తుండటంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ప్రైవేట్ యాజమాన్యాలు కేవలం లాభాపేక్షతో పనిచేస్తాయని, అదే జరిగితే పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్ష అవుతుందని హెచ్చరించారు.

వైద్య విజ్ఞానం పెంపొందించేందుకే క్విజ్ పోటీలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: వైద్య విజ్ఞానం కోసమే రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామని స్విమ్స్ సంచాలకులు డాక్టర్ ఆర్వి కుమార్ తెలిపారు. స్విమ్స్ శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ఫిజియాలజీ విభాగం ఆధ్వర్యంలో 6వ రాష్ట్ర స్థాయి హయాగ్రీవా -2025 క్విజ్‌ను గురువారం స్విమ్స్ ఎస్.పి.ఎం.సి. డబ్ల్యూ లెక్చర్ గ్యాలరీ-1లో నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ క్విజ్ కార్యక్రమాలు స్విమ్స్ శ్రీ పద్మావతి వైద్యకళాశాలలో నిర్వహించడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమం విజ్ఞానం పెంపొందించేందరుకు దోహదపడుతుం దన్నారు. ఫిజియాలజి విభాగాధిపతి డాక్టర్ శరణ్ బి సింగ్ మాట్లాడుతూ వైద్య విద్యార్థులలో వైద్య శాస్త్రంపై మక్కువ, వారిలోని సృజనాత్మకతను వెలికితీయడమే లక్ష్యంగా క్విజ్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్విజ్‌లో పాల్గొన్న వైద్యకళాశాలు : 1. శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాల- తిరుపతి, 2. గవర్నమెంట్ మెడికల్ కళాశాల-ఒంగోలు 3.నారాయణ మెడికల్ కళాశాల-నెల్లూరు, 4. శ్రీ బాలాజి మెడికల్ కళాశాల- రేణిగుంట, 5. అపోలో మెడికల్ కళాశాల- చిత్తూరు నుండి పాల్గొన్న 30 మందితో విద్యార్థిని, విద్యార్థులతో 10 టీమ్‌లగా విభజించి క్విజ్ కాంపెటీషన్‌ను నిర్వహించారు. ఈ క్విజ్ పోటీలలో ప్రథమ శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాల- తిరుపతి గంగ, ధనుశ్రీ, ఉష్రశ్రీ, ద్వితీయ స్థానం అపోలో మెడికల్ కళాశాల- చిత్తూరుకు చెందిన చాతుర్య, దీక్షిత, సాయి లీక్షిత, తృతీయ స్థానం శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాల- తిరుపతికి చెందిన బి. కౌసల్య, అఖిల, ఆత్మజ, నాలుగోవ స్థానం నారాయణ మెడికల్ కళాశాల-నెల్లూరుకు చెందిన సాయి సంకీర్త్, హేమంత్ కుమార్, శ్రీకర్ గెలుపొందారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ అలోక్ సచన్, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ డాక్టర్ శిల్పా కడియాల, శ్రీ పద్మావతి వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషా కళావత్, డాక్టర్ ముత్తీశ్వరయ్య, డాక్టర్ నాగరాజు, డాక్టర్ శరణ్ బి సింగ్, డాక్టర్ శర్వాణి, అర్పణ, ఫిజియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ హిమజ, డాక్టర్ సునీత, విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న సాయి యాదవ్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తెలంగాణ మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కుమారుడు, తలసాని సాయి యాదవ్ గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం తిరుమలలోని గరుడ హోటల్ అధినేత ప్రసాద్‌తో కలిసి తిరుమల క్షేత్ర పాలకూడి ఆలయాన్ని సందర్శించారు. తర్వాత బాటగంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీలో అక్రమాలు అవాస్తవం

ప్రజాశక్తి - రామచంద్రపురం : చంద్రగిరి నియోజకవర్గంలో రాజకీయాలకు అతీతంగా రబీ సీజన్లో వ్యవసాయానికి ప్రతి రైతుకు కూటమి ప్రభుత్వం యూరియా, జిప్సం అందజేసి ఆదుకుంటుందని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎం.తిరుమలరెడ్డి పేర్కొన్నారు. గురువారం సింగల్ విండో కార్యాలయంలో యూరియా పంపిణీపై వచ్చిన అసత్య కథనాలను టిడిపి నాయకులు ఖండించారు. మండలంలో1400 ఎకరాలలో పంట సాగుకు 2255 యూరియా బస్తాలను రైతులకు అందజేశామని రాష్ట్ర ఎంఎస్ఎమ్ఈ డైరెక్టర్ చినబాబు తెలిపారు. సింగల్ విండో ఛైర్మన్ జనార్దన్ చౌదరి మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. మండల వ్యవసాయ శాఖ అధికారిణి మమత మాట్లాడుతూ ప్రతి రైతుకు దశలవారీగా యూరియా అందజేస్తామని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో కోరా హరి ప్రసాద్, రావిళ్ళ గిరినాయుడు, కమలాకర్ రెడ్డి, మురళీమోహన్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుగరాజపట్నం పంచాయతీని విభజించాలి

ప్రజాశక్తి - వాకాడు: పంచాయితీల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా వాకాడు మండల పరిధిలోని దుగరాజపట్నం పంచాయతీని విభజించాలని గురువారం తాసిల్దార్ సయ్యద్ ఇక్బాల్‌కు మత్స్యకార నాయకుడు మహేంద్ర ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. సుమారు 1100 మంది మత్యకారులు దుగరాజపట్నం పంచాయతీలో ఉన్నారు. ఈ 1100 మంది మత్యకారులను కలిపి పంచాయతీగా గుర్తిస్తే పరిపాలన సౌలభ్యంతో పాటు, సౌకర్యంగా ఉంటుందని మత్స్యకార నాయకుడు మహేంద్ర, మత్యకార కాపులు, మత్స్యకారులు తహశీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గ్రామ సభ ద్వారా తీర్మానం చేయడం జరిగిందని వివరించారు.

ఖాతాదారుల ప్రయోజనాలే ప్రాధాన్యం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : 2026 ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ అత్యుత్తమంగా 99.33 శాతం క్లెయిమ్ సెటిల్మెంట్ నిష్పత్తిని నమోదు చేసిందని ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ అమీష్ బ్యాంకర్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశీయంగా అగ్రగామి జీవిత బీమా కంపెనీల్లో ఇది అత్యధికమన్నారు. అన్నింటికన్నా ముఖ్యంగా సగటు క్లెయిమ్ సెటిల్మెంట్ టర్నెరౌండ్ సమయమనేది, నాన్-ఇన్వెస్టిగేటెడ్ క్లెయిమ్‌లకు సంబంధించి కేవలం 1.1 రోజులుగా నమోదైందని తెలిపారు. ఇదే వ్యవధిలో మొత్తం రూ. 893.38 కోట్లు విలువ చేసే డెత్ క్లెయిమ్‌లను కంపెనీ సెటిల్ చేసిందని తెలిపారు. కస్టమర్ల ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నమని తెలిపారు. డాక్యుమెంట్లు సమర్పించిన తర్వాత, అర్హత కలిగిన క్లెయిమ్‌లను ఒక్క రోజులోనే సెటిల్ చేస్తామని వెల్లడించారు. గత త్రైమాసికంలో అత్యుత్తమ సెటిల్మెంట్ నిష్పత్తిని సాధించామన్నారు.

25మంది విద్యుత్ ఉద్యోగులపై క్రమశిక్షణా చర్యలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఎపిఎస్పిడిసిఎల్ పరిధిలో 25 మంది అధికారులు, సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటూ ఆ సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. సంస్థ పరిధిలోని వివిధ సర్కిల్స్ లో విధులు నిర్వహిస్తూ అవినీతి ఆరోపణలు, ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించకపోవడం, అనధికారికంగా పనులను చేపట్టడం, విధి నిర్వహణలో అలసత్వం, ఎసిబి కేసులు, నిబంధనలను పాటించకపోవడం తదితర అంశాలపై ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-1, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు-5, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్/అసిస్టెంట్ ఇంజనీర్-13, జూనియర్ ఇంజనీర్-1, లైన్ ఇన్స్పెక్టర్-1, లైన్ మ్యాన్-1, అసిస్టెంట్ లైన్ మెన్- 2. ఎనర్జీ అసిస్టెంట్-1లపై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారు. దీంతో పాటు క్రమశిక్షణా చర్యలపై మరో ముగ్గురు ఉద్యోగుల అప్పీళ్ళను తిరస్కరించారు. మరికొన్ని కేసుల్లో విచారణ ప్రక్రియ కొనసాగుతోంది. విచారణ పూర్తయిన అనంతరం తగిన క్రమశిక్షణా చర్యలు తీసుకోనున్నారు.

ఇంధన పరిరక్షణపై పోస్టర్స్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఎపిఎస్ పిడిసిఎల్ పరిధిలో ఇంధన పరిరక్షణ వారోత్సవాల నేపథ్యంలో ఆ సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి గురువారం తిరుపతిలో పోస్టర్లను ఆవిష్కరించారు. సంస్థ పరిధిలోని తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, నెల్లూరు, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఈనెల 14 నుంచి 20వతేదీ వరకు ఇంధన పరిరక్షణ వారోత్సవాలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ వారోత్సవాల్లో భాగంగా తిరుపతిలో ఈనెల 19, 20 తేదీల్లో సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తామని, ఈ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులకు ఇంధన పరిరక్షణ-అవశ్యకత అంశంపై పోటీ నిర్వహిస్తామని తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో 9, 10వ తరగతి చదివే విద్యార్థులు పాల్గొనాలని తెలిపారు. ఇంధన పరిరక్షణఅంశంపై సంస్థ పరిధిలోని 9 జిల్లాల్లో విద్యార్థులకు వక్తృత్వపు, క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నారని, ఈ పోటీల్లో పాల్గొని, గెలుపొందిన విద్యార్థులకు ఈనెల 17వతేదీన తిరుపతి నుంచి ఆన్లైన్ ద్వారా ఫైనల్ రౌండ్ పోటీలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. విజేతలకు ఈనెల 20వతేదీన బహుమతుల ప్రదానం నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (టెక్నికల్ అండ్ హెచ్‌ఆర్ డి) గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్లు ఆదిశేషయ్య, ఉమాపతి, జనరల్ మేనేజర్ శ్రీనివాసులు, తిరుపతి సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ చంద్రశేఖర రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గంగాధర్ రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జయప్రకాష్, ఎన్జీవో సంస్థ ప్రతినిధి మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు 'టెట్' మినహాయింపు ఇవ్వాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - నాయుడుపేట: ఏళ్ల తరబడి ఉపాధ్యాయ వృత్తిలో ఉండి, చాలావరకు రిటైర్మెంట్‌కు దరిదాపుల్లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ పరీక్షలు రాయమనటం సరికాదని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (యుటిఎఫ్) ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమం చేపట్టారు. నాయుడుపేట మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట గురువారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో నాయుడుపేట, ఓజిలి, పెళ్లకూరు మండలాల ఉపాధ్యాయులు పాల్గొని నిరసన అనంతరం నాయుడుపేట తహశీల్దార్‌కు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. టెట్ పరీక్ష నుండి ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలనే ప్రధాన ప్రతిపాదనతో ఈ ఆందోళన కార్యక్రమం చేపట్టినట్లు ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు తెలిపారు. కార్యక్రమానికి యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, ఎఫ్‌డబ్ల్యూఎస్ డైరెక్టర్ సుబ్బారావు, నాయుడుపేట మండల అధ్యక్ష-ప్రధాన కార్యదర్శులు వి.వి.సుబ్బారెడ్డి, రాజగోపాల్, ఓజిలి మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, పెళ్లకూరు ప్రధాన కార్యదర్శి వాసు సహా అనేక మంది యూటీఎఫ్ కార్యకర్తలు హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు మాట్లాడుతూ 2010కు ముందు డీఎస్సీ ద్వారా నియమితులైన ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను ఇప్పుడు టెట్ పరీక్షలకు రాయమనడం సరికాదని సర్వీస్ లో ఉన్న ఉపాధ్యాయులను ఈ పరీక్షల నుంచి మినహాయించాలని కోరారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయుల నిజమైన సమస్యలు అర్థం చేసుకుని వారిని అనవసర ఒత్తిడికి గురి చేయకుండా నిర్ణయాలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా, రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో రిటి పిటిషన్ దాఖలు చేసి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నాయుడుపేట తహశీల్దార్ రాజేంద్రకు వినతిపత్రం సమర్పించారు. నిరసనలో పాల్గొన్న మూడు మండలాల ఉపాధ్యాయులు ఏకగ్రీవంగా ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలని నినాదాలు చేశారు.

పోలేరమ్మ ఆలయ ఆర్చి నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: వెంకటగిరి పట్టణం పాలకేంద్రం సెంటర్ వద్ద పోలేరమ్మ అమ్మవారి ఆర్చి నిర్మాణానికి సిద్ధం అయ్యింది. పట్టణంలోని ప్రముఖ ప్రింటింగ్ ప్రెస్ యజమాని కోనా వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఆర్చి నిర్మాణ బాధ్యతలు తీసుకోనున్నట్లు ఎంఎల్ఏ కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. గురువారం ఆయన నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. పాలకేంద్రం నుంచి పట్టణంలోకి వెళ్లే ఈ ప్రధాన రహదారి మొత్తం వెడల్పు 105 అడుగులు ఉందని సంబంధిత శాఖ అధికారులు వెల్లడించారు. అయితే రహదారి ఇరువైపులా ఉన్న కొన్ని ఆక్రమణలు రహదారి పైకి వచ్చి ఉండటంతో, వాటిని తొలగించి ఆర్చి నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. దీంతో తమ వ్యాపార స్థలాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని కొంతమంది బాధితులు ఎంఎల్ఏ రామకృష్ణ దృష్టికి తెచ్చారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ, ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఆర్చి నిర్మాణం పూర్తైతే వెంకటగిరి పట్టణానికి కొత్త కళ ఏర్పడుతుందనే భావన పట్టణ వాసుల్లో వ్యక్తమవుతోంది. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు, కమిషనర్, ఆర్ అండ్ బి అధికారులు, సిఐ, పట్టణ ముఖ్యనేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జగన్ ప్రతిష్టను దెబ్బతీయడమే చంద్రబాబు లక్ష్యం : భూమన

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డిని రాజకీయంగా దెబ్బతీసేందుకు టీటీడీని వేదికగా చేసుకుంటున్నారని టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి విమర్శించారు. పద్మావతి పురంలోని ఆయన నివాసంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తాము అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా.. చంద్రబాబు నాయుడు ఆరోపణలే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. వైకుంఠ ఏకాదశి తొక్కిసిలాట, పరకామణి వ్యవహారం, కల్తీ నెయ్యి కేసు, తాజాగా శ్రీవారి శాలువల వ్యవహారాన్ని తెరపైకి తెస్తూ టీటీడీని ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. విజిలెన్స్ రిపోర్టులో 2015 నుంచి 25 వరకు శాలవాలు కొనుగోలులో అవకతవకలు జరుగుతున్నాయని చెబితే, నేను ఛైర్మన్‌గా ఉన్నప్పుడే జరిగిందని విమర్శించడం విడ్డూరమన్నారు. బి ఆర్ నాయుడు ఛైర్మన్ అయ్యాక గోవులు మరణిస్తున్నాయి, విగ్రహాలు మలమూత్రాలు మధ్యలో పడుతున్నాయి, ఆలయ మాడవీధుల్లో మద్యం మాంసాలు విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు, దళారులు రాజ్యమేలుతున్నారు. సేవా టికెట్ల విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయన్నారు. ఏఐ టెక్నాలజీతో దేవుని రెండు నిమిషాల్లో చూపిస్తానంటున్న వ్యక్తి, సుదూరాల నుంచి శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు పుష్పక విమానాలు పంపించినా ఆశ్చర్యం లేదని ఎద్దేవ చేశారు. నా వెనక న్యాయాధికారి ఉన్నారని చెబుతున్న బిఆర్ నాయుడు దమ్ముంటే ఆయన పేరు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష, నల్లని బాబు పాల్గొన్నారు.

జలదంకి మధుసూదన్ రెడ్డికి నివాళి

ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట సీనియర్ నాయకులు, ప్రముఖ కాంట్రాక్టర్ జలదంకి మధుసూదన్ రెడ్డికి మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, పలువురు నాయకులు నివాళులర్పించారు. నాయుడుపేట, మాతృశ్రీ అపార్ట్మెంట్లో గురువారం మధుసూదన్ రెడ్డి ఉత్తరక్రియల నిర్వహించారు. నాయకులు జలదంకి మధుసూదన్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పమామర్శించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, మాజీ ఏఎంసీ ఛైర్మన్ తంబిరెడ్డి రెడ్డి జనార్ధన్ రెడ్డి, వైసీపీ పట్టణ అధ్యక్షులు కలికి మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిపి కోట - చిన్నపాండూరు రోడ్డుకు భూమి పూజ

ప్రజాశక్తి - నాగలాపురం: నాగలాపురం వయా టి పి కోట చిన్నపాండూరు రోడ్డు నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే ఆదిమూలం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా నాగలాపురం నుండి టిపి కోట రహదారి గుంతలమయమై, అధ్వాన స్థితిలో ఉందన్నారు. ఈ రోడ్డు నిర్మాణం చేపట్టాలని అసెంబ్లీ, ఆర్ అండ్ బి మంత్రి, జిల్లా కలెక్టర్, జిల్లా ఆర్ అండ్ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడంతో ప్రభుత్వం స్పందించి 11 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని తెలిపారు. అలాగే టిపి పాలెం నుండి సత్యవేడు మండలం వరకు మరో ఐదు కోట్ల రూపాయలు మంజూరయ్యాయని తెలిపారు. సురుటుపల్లి నుంచి దాసు కుప్పం బైపాస్ రోడ్డు నిర్మాణ పనుల ప్రతిపాదన ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాజీ ఎంపీపీ మురళి, ఎస్ఎం సురేష్, ప్రసాద్ రాజు, ఇలంగోవన్ రెడ్డి, మనోహర్, రాజమాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL SUBORDINATE JUDGE AT PONNERI
MCOP No.193/2024

Duvvuru Harikrishna ....Petitioner
Vs
1. M/s.Friends Travels Rep by Its P.Murali Sreenivasa Rao
2. The United India Insurance Company Limited., ...Respondents

To,
M/s. Friends Travels, Rep by its P.Murali Sreenivasa Rao, No.8-1085, Bapuji Colony, Sri Balaji, Sullurupeta, Andhra Pradesh - 524121.

NOTICE

Please take that you are the First Respondent owner of the vehicle involved accident. Your appearance of this above said court on 06.02.2026 at 10.30 Am without fail otherwise exparte on the same date.

Yours,
A.Devendran, B.Sc.,BL.,
Counsel for Petitioner.

IN THE COURT OF THE VIII ADDITIONAL DISTRICT JUDGE :: AT CHITTOOR
Execution Petition No. 10 /2025
Arbitration Case. No. 40 /2023

Between:
M/s. Shriram Finance Ltd., rep., by its Power of Attorney Holder, G.Reddi Prasad ..... **Decree Holder**
And:
Gikriya Shaik and others ..... **Judgment debtors**

NOTICE TO J.Dr No. 2 U/o XXI, R. 54 of C.P.C

To
J.Dr No.2, Aslam Patnool, S/o. Late. P.Kareemulla, D.No.14-70/1, Kama thampalli, Pakal Mandal,Tirupati District

Please take notice that the D.Hr filed the above E.P. against you for realization of the award/decree amount in the above Arbitration Case and the above E.P.is posted to your appearance before the above said Hon'ble Court on 06-01-2026 at 10.30 a.m. either in person or through counsel. In the event of your failure to appear as afore said the matter will be decided as ex-Parte in your absence.

Hearing Date: 06-01-2026
Time: 10:30AM.
(By Order of the Court)
K.C.KISHOR KUMAR
Advocate for Petitioner/D. Hr

PUBLIC NOTICE

The General Public is hereby informed that as per instructions of my client's Thejaswini and R Harshitha Resident of Tirupati town, Sundaraiah nagar Residential area, D.no.18-6-127, intended to sell their property to J Sasi and the said J Sasi approached my Client's Bank I.e., IndusInd Bank ltd., Tirupati branch with a request to advance of Housing Loan By mortgaging his property described below: Description and location of the property Property Situated at Tirupati District–Tirupati Registration District–Tirupati Sub-District –Tirupati Urban Mandal–No.29, Tirupati village accounts–Revenue Sy.No.417/12, 417/14–Tirupati Municipal Corporation–Ward No.18, Block No.6 – Sundaraiah Nagar Residential area–Municipal assessment No.1012033111, D.No.18-6-127 & Municipal Assessment No.10120 63289, D.No.18-6-127/a–RCC House, in which site bounded on East:House of S.Sethu, West:House D.No.18-6-126 of Chandraiah North:20 ft wide road, South:House of M.Venkata sivaiah Measurements, East to West on both sides 33 ft or 10.065 mts North to South on both sides 40 ft or 12.200 mts. Admeasuring 1320 Sq.ft 146.66 Sq.yards of site, in it constructed an extent of 495 Sq.ft of ground floor parking site, 825 Sq.ft of ground floor RCC House, 1320 Sq.ft of 1st floor RCC House, 1320 Sq.ft of 2nd floor RCC House, 525 Sq.ft of 3rd floor RCC House along with structures and electricity service Nos.5534100159614, 5534100159612, 5534100159566. That on behalf of My client I caution the General public, if any person/Institution, is having any objections, claims, interest for the above property, intended person may contact the undersigned with relevant documentary proof substantiating his / her/ their objections, claims and disputes etc., within (5) days from the date this notice, failing which my client will proceed with transaction by accepting the above said property as security, as if there are no third party claims or objections in respect of above said property and thereafter no claims or objections will be entertained.

KATARI MAHESH M.A.,LL.M.,
ADVOCATE
D.NO.19-12-351, BAIRAGIPETTADA,
TIRUPATI, CELL:9652405240

క్రైం న్యూస్

టీటీడీ ఉద్యోగి ఇంట్లో భారీ చోరీ

320 గ్రాముల బంగారం, రూ.10 లక్షలు నగదు అపహరణ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతి రూరల్, పెరుమాళ్లపల్లి పంచాయతీ, ఎస్వీ నగర్‌లో నివాసముంటున్న టిటిడి ఉద్యోగి, తిరుచానూరులో దఫేదారుగా పనిచేస్తున్న మురళి మోహన్ ఇంటిలో బుధవారం రాత్రి దొంగలు పడి దోచుకెళ్లారు. బుధవారం మధ్యాహ్నం విధులు ముగించుకుని మురళీమోహన్ తన భార్యతో కలిసి కూతురు వివాహ ఏర్పాట్ల నిమిత్తం బెంగళూరుకు వెళ్లారు. గురువారం ఉదయం ఇంటికి వచ్చిన బాధితురాలు కుమార్తె గాయత్రి ఇంటి తలుపులు తెరచి ఉండడానికి గమనించి తండ్రికి సమాచారం ఇచ్చింది. బెంగళూరు నుంచి తిరుపతికి చేరుకున్న మురళీమోహన్ ఇంటిని పరిశీలించి దొంగతనం జరిగినట్లు గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, క్లూస్ టీం, ఫింగర్ ప్రింట్ అధికారుల ఆధారాలు సేకరించారు. సుమారు పది లక్షల నగదు, 320 గ్రాముల బంగారు నగలు చోరీకి గురైనట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కార్మికుడిని ఆదుకోండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో విద్యుద్దీకరణ పనులు చేస్తూ తీవ్రంగా గాయపడ్డ రామును ఆలయం తరపున ఆదుకోవాలని ట్రస్ట్ బోర్డు మాజీ ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు డిమాండ్ చేశారు. స్థానిక ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రామును గురువారం ఆయన పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. శస్త్ర చికిత్స చేయించుకునే వరకు పరిస్థితి వెళ్ళిందంటే గాయం తీవ్రత అర్థమవుతుందన్నారు. ఆలయం తరపున రాముకు వైద్య సాయం అందజేయాలని కోరారు. మాజీ ధర్మకర్తల మండలి సభ్యుడు సురా సురేష్, ప్రసాద్, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులు నిరసన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : హిందూపురం టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ అతని సిబ్బంది కోర్టు ఆదేశాలను ధిక్కరించి సివిల్ కేసులో జోక్యం చేసుకొని, న్యాయవాది అబ్దుల్ రహీంను అసభ్యకరంగా మాట్లాడినందుకు, పుత్తూరు న్యాయవాదులు గురువారం విధులు బహిష్కరించి, మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గాలి సురేష్ బాబు, కార్యదర్శి రాజేష్‌లు మాట్లాడుతూ పోలీసులు న్యాయవాదులను నీచంగా మాట్లాడడం సభ్యత కాదని, సిఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు జానకి రామ్, సంజీవి పాల్గొన్నారు.

ఆర్ఐఓ ఆఫీస్ వద్ద విద్యార్థి సంఘాల ధర్నా

ప్రజాశక్తి - క్యాంపస్ : చంద్రగిరి నారాయణ జూనియర్ కళాశాలలో బుధవారం ఓ విద్యార్థికి రెండవ అంతస్తు నుంచి కిందపడి తీవ్ర గాయాలు కావడంతో హాస్పిటల్‌లో చికిత్స పొందుతు న్నాడు. విద్యార్థి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నప్పటికీ, ఇంతవరకు ఆర్ఐఓ స్వయంగా విచారణ లేదా పరామర్శకు రాకపోవడం విద్యార్థి సంఘాల్లో ఆగ్రహాన్ని రేకెత్తించింది. ఈ నిర్లక్ష్య వైఖరి పట్ల స్పందించిన తిరుపతి విద్యార్థి సంఘాలు ఆర్ఐఓ కార్యాలయాన్ని ముట్టడించి, విద్యార్థికి న్యాయం జరిగేంతవరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశాయి. కళాశాల గుర్తింపును రద్దు చేసి, యాజమాన్యంపై క్రిమినల్ కేసులు బనాయించాలని డిమాండ్ చేశారు. ఈ ముట్టడి కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి యూనివర్సిటీ ప్రెసిడెంట్ ప్రేమ్ కుమార్, వైసిపి విద్యార్థి విభాగం నగర అధ్యక్షుడు స్వరూప్, ఎన్ఎస్ యుఐ తిరుపతి జిల్లా అధ్యక్షుడు శివ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION): TIRUPATI
H.M.O.P.No. 298 / 2024

K.Haritha ...Petitioner
Vs
E.Gunasekhar ...Respondent

NOTICE TO RESPONDENT

E.Gunasekhar, S/o.E.Krishna Murthy, residing at D.No.13-1-27, P.K.Street, Tirupati, Tirupati District, Cell No. 9704937778.

Please take notice that the petitioner filed the above case dissolving the marriage against you and the same is posted for your appearance. So, you are hereby called upon to appear before the Hon'ble Court on 15-12-2025 at 10.30 a.m., failing which the matter will be decided exparte.

Hearing Date: 15-12-2025
//'by order of court//
M.G.VIJAYA KUMAR
Advocate for Petitioner, Tirupati

IN COURT OF THE VII ADDITIONAL DISTRICT JUDGE, GUDUR
G.O.P. NO: 27 /2025

(In the matter of the Guardian and Wards Act, VIII of 1890) (In the matter of the estate of the Minor Guntamandugu Yashmitha, daughter of late Bhaskar Rao, aged about 10 years, Ten Years Hindu, student, resident of Flat No. 708, Seven hundred and Eight, B-Block, Marg Viswasakthi Apartment, Thiruchanooru by Pass Road, Tirupati Rural, Yogimallavaram,Tirupati District) (In the matter of permission to the petitioner to mortgage the undivided 1/3rd share of minor in the GOP Schedule property infavour of Nationalized Bank for obtain education loan) Guntamadugu Sashirekha, W/o late Bhaskar Rao, Aged 39, Thirty Nine years, House Maker, Flat No. 708, Seven hundred and Eight, B-Block, Marg Viswasakthi Apartment, Thiruchanooru by Pass Road, Tirupati Rural, Yogimallavaram, Tirupati District. ....Petitioner
Vs
Nil ...Respondant

ప్రకటన

పై నెంబర్ G.O. Petiiton లోని పిటీషనరు తన కుమారుని మరియు కుమార్తె చదువులు కొరకు పిటిషన్ షెడ్యుల్‌లో చూప్పబడిన ఆస్తిని Nationalized Bank లో Mortgage చేసి Educational loan తీసుకొన్నదానికి పర్మిషన్ కొరకు పై కోర్టు లో పిటిషన్ వేసిఉన్నారు. సదురు పిటిషన్ తేది 16-12-2025 వాయిదా వేసిఉన్నారు. కావున ఎవరికైన అక్షేపణలున్న మీరు పై తేది న ఉదయం 10-30 గంటలకు పై కోర్టు లో హాజరై మీ అక్షేపణలున్న తెలుపుకోన్నవలెను, లేనియెడల సదురు G.O.Petiton ను మీ పరోక్షము గా విచారించి తీర్మానము చేయబడును.

SCHEDULE

S.P.S.R.Nellore District now Tirupati District., Gudur District Registration now Tirupati District Registration, Naidupeta Sub-Registration, Naidupeta Mandal, Naidupeta Gram Panchayathi, Now Naidupeta Municipality, L.A.Sagaram alias Agraharapeta, 3rd Ward, 11th Block, near by Juvvalapalem Road, towards west of Door No. 3-11-65 house, house site of an extent of 27 Ankanams and 32 Sq.feet, Twenty seven Ankanams and Thirty two Sq.feet or 219.6/9 Sq.yards Two hundred and Nineteen, Six/Nine Sq.yards out of Ac.1-19cents One Acre and Nineteen cents in Survey No. 91-2C and in existing Terraced Building bearing Door No. 4-2- 3 within the following boundaries, East: 12 feeet width road, South: Site of Nandhimandalam Chandra, West: Land of Muppalla Muralidhar Reddy and North: Land of Duvvuru Pitchi Reddy
Total Valuation : Rs. 72,00,000-00 Rupees Seventy Two Lakshs only

ఇట్లు
D. హరనాద్ రెడ్డి, B.A., B.L.
పిటీషనరు తరుపున న్యాయవాది
నాయుడుపేట టౌన్,
Cell No. 9440329137

సరస్వతీ దేవి విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం సరస్వతీ దేవి విగ్రహ ప్రతిష్టాపన వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహ దాత విశ్రాంత డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ తన తల్లిదండ్రుల గుర్తుగా లక్ష రూపాయలతో మూడు అడుగుల ఎత్తున్న సరస్వతీ దేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశానని తెలిపారు. ఈ కార్యక్రమంలో దాత దంపతులు, చిత్తూరు జిల్లా డిఈఓ రఘుపతి దంపతులు, ప్రిన్సిపాల్ పద్మావతి దంపతులు, విగ్రహ రక్షణకు లక్ష రూపాయల వ్యయంతో విశాలమైన పెద్ద నిర్మాణ దాత నరసింహారావు దంపతులు, తిరుపతి గోవిందధామం వ్యవస్థాపక అధ్యక్షుడు దామోదరం, డాక్టర్లు సుభాషిణి, రవిరాజు, విశ్రాంత న్యాయమూర్తి లక్ష్మీపతి, వాకర్ అసోసియేషన్ సభ్యులు, విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడపరాదు

ప్రజాశక్తి - వాకాడు: తిరుపతి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, గురువారం వాకాడు సబ్ ఇన్స్పెక్టర్ నిఖిల్ బాబు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా మైనర్లు వాహనాలు నడపరాదని, అతిక్రమించి నడిపినట్లయితే వాహనదారుడుపై, తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించి, సరైన ధ్రువపత్రాలతో, ప్రయాణించాలని, మద్యం సేవించి ఎవరు వాహనాన్ని నడప రాదని తెలిపారు. మైనర్ వ్యక్తులకి, తల్లిదండ్రులకి, వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

ఆదర్శ మహిళా సంఘాలకు శిక్షణ

ప్రజాశక్తి-వెంకటగిరి: వెంకటగిరి మండలంలోని ఆదర్శ మహిళా సంఘాలకు గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. గురువారం ఏపిఎం శైలజ, సమాఖ్య పరిధిలోని 30 గ్రామ సంఘాల్లోని వి.ఓ., అధ్యక్షురాలకు ఎం.సి.ఎల్.ఎఫ్ పై శిక్షణ ఇచ్చినట్లు తెలియజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 12వతేది వరకు ఈకార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈశిక్షణలో ఆదర్శ మండల సమాఖ్య, ఆదర్శ గ్రామ, ఆదర్శ సంఘాలుగా ఉండాలంటే ఎలాంటి విధి విధానాలు పాటించాలనే అంశంపై ఈశిక్షణ ఇచ్చినట్లు తెలియజేశారు. ఈకార్యక్రమంలో సి.సి.లు, సిబ్బంది పాల్గొన్నారు.

కర్మక్రియలకు హాజరైన ఎమ్మెల్యే నాని

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలం, కాపువీధి గుర్రమ్మ, ఏనుగుల వాసు నాయుడు కర్మక్రియలకు గురువారం ఎమ్మెల్యే పులివర్తి నాని హాజరయ్యారు. కాపువీధి గుర్రమ్మ, నాగయ్యగారి పల్లెకు చెందిన ఏనుగుల వాసునాయుడు చిత్రపటాలకు నివాళి లర్పించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు ఏజి బాల, సెక్రటరీ కొండూరు ప్రవీణ్, మార్కెట్ కమిటీ చైర్మన్ గౌస్ బాషా, సక్కురు ధనంజయ్ రెడ్డి, పాదిరి నాగిరెడ్డి, కూటమి ప్రభుత్వం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నవోదయ ఎంట్రన్స్ టెస్ట్‌కు విశేష స్పందన

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి, విశ్వం ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ నిర్వహించిన నవోదయ 2026 మోడల్ ఎంట్రన్స్ టెస్ట్‌కు విశేష స్పందన లభించింది. నవోదయ ప్రవేశ పరీక్ష నమూనాలోనే రూపొందించిన ఈ పరీక్షకు మొత్తం 347 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్. విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ ఈ తరహా మోడల్ పరీక్షలు విద్యార్థుల సిద్ధతను అంచనా వేయడంలో కీలకమని సూచించారు. వివరాలకు 86888 88802 / 9399976999 నంబర్లను, వరదరాజ నగర్, విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు.

పద్మావతి ఘాట్‌ను పరిశీలించిన తుడా చైర్మన్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో : తిరుచానూరు స్వర్ణముఖి నది తీరాన ఏర్పాటు చేయనున్న పద్మావతి ఘాట్‌ను గురువారం తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే పూర్తి చేసి, సీఎం ఆదేశాలతో ఘాట్ నిర్మాణం ప్రారంభించి, వాటర్ స్టోరేజ్, ఫిల్టర్ చేసి, గంగా హారతి అన్ని రకాలుగా సౌకర్యాలతో ఘాట్ నిర్మాణం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

లగేజీ తనిఖీ కేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యార్థం తోపాటు, తిరుమల భద్రతకు నూతనంగా కెనరా బ్యాంకు (సిఎస్ఆర్)తో ఏర్పాటు చేసిన కొత్త లగేజీ తనిఖీ కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని టిటిడి సివి అండ్ ఎస్ఓ కె.వి మురళీకృష్ణ పేర్కొన్నారు. గురువారం అలిపిరి సప్తగిరి తనిఖీ కేంద్రం వద్ద కెనరా బ్యాంకు సహకారంతో ఏర్పాటు చేసిన కొత్త లగేజీ కేంద్రాన్ని కెనరా బ్యాంకు ఎండి అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె. సత్యనారాయణ రాజుతో కలిసి మురళీకృష్ణ ప్రారంభించారు. కెనరా బ్యాంకు టిటిడికి ఉన్న సత్సంబంధాలలో భాగంగా లక్షలాదిమంది శ్రీవారి భక్తులకు ఈ సేవను కెనరా బ్యాంకు ద్వారా అందించడం సంతోషంగా ఉందని సత్యనారాయణరాజు పేర్కొన్నారు. టీటీడీకి భద్రతకు సంబంధించిన మౌలిక సదుపాయాలను పెంపొందించడంలో తగిన సహకారాన్ని అందిస్తున్న కెనరా బ్యాంకు వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని మురళీకృష్ణ అన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కెనరా బ్యాంకు తిరుపతి సర్కిల్ ఆఫీసు డిప్యూటీ జనరల్ మేనేజర్ రవీందర్ కుమార్ అగర్వాల్, డిప్యూటీ జనరల్ మేనేజర్, కెనరా బ్యాంక్ రీజనల్ హెడ్ రామమోహన్, బ్యాంకు డివిజనల్ మేనేజర్ సువర్ణకృష్ణ, తిరుమల బ్రాంచ్ మేనేజర్ జయసింహ, టిటిడి విజిలెన్స్ డిఎస్పి గిరిధర్, సిఐ రామకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుంటే జరిమానా

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే జరిమానా తప్పదని వన్ టౌన్ సిఐ ప్రకాష్ కుమార్ హెచ్చరించారు. గురువారం పట్టణంలోని పెండ్లిమండపం కూడలి వద్ద హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపితే కలిగే అనర్థాలను వివరించారు.

మహిళలకు భద్రతా నైపుణ్యాలపై శిక్షణ

ప్రజాశక్తి-ఏర్పేడు : మహిళలు అత్యవసర పరిస్థితిలో తీసుకోవాల్సిన ప్రాథమిక ప్రాణ రక్షణ చర్యలు, సిపిఆర్, కాలిన గాయాలు, రక్తస్రావం, ఎముకల విరుగుడు, పాముకాటు వంటి అంశాలపై ఫస్ట్ ఎయిడ్ నిపుణుడు రత్నశేఖర్, ఆయన బృందం ఎస్ ఓ ఎస్ లో రెండు రోజులపాటు మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణా కార్యక్రమంలో 150 మంది మహిళలు పాల్గొని, కుటుంబాల్లో పిల్లల భద్రత కోసం ఫస్ట్ ఎయిడ్ నైపుణ్యాల ప్రాముఖ్యత అవసరమన్నారు. ఈ కార్యక్రమాలో అసిస్టెంట్ డైరెక్టర్ సత్యనారాయణ, మునిరత్నం, వెంకటరమణ పాల్గొన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

ప్రజాశక్తి-ఏర్పేడు: ఏర్పేడు ప్రాథమిక పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఐఆర్‌టి టీచర్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈఓ ప్రేమలత చేతుల మీదుగా మండలంలోని 40 మంది దివ్యాంగులైన విద్యార్థులకు అలవెన్స్‌లు, 18 విద్యార్థులకు వారి లోపాలను సరిచేసే ఉపకరణములు అందించారు. జిల్లాస్థాయి క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు.

వైకుంఠ ఏకాదశి ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలం, శ్రీనివాస మంగాపురం ఆలయం, శ్రీవారి మెట్టు, అలిపిరి పాదాలు, టోల్ గేట్, మొదలగు ప్రాంతాలు, క్యూ లైన్ ఎంట్రీ పాయింట్లు, పార్కింగ్, భక్తులు చేరుకునే ఇతర ప్రాంతాలను తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీకృష్ణలు గురువారం పరిశీలించారు. వైకుంఠ ఏకాదశి పార్వదినాన్ని పురస్కరించుకొని తిరుమల శ్రీవారి దర్శనార్థం భక్తులకు ఆన్లైన్ టోకెన్ సేవలను టీటీడీ ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు, క్యూ వ్యవస్థ, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలను సమీక్షించారు. ఈ సమీక్షలో అదనపు ఎస్పీలు రవిమనోహార చారి (శాంతి భద్రతలు), శ్రీనివాసుల రావు, (ఏ ఆర్) డి.ఎస్.పీలు భక్తవత్సలం ఈస్ట్, చంద్రశేఖర్ ఏ.ఆర్, వి.జి.ఒ లు సురేంద్ర, గిరిధర, సి.ఐ లు మద్దయ్య ఆచారి, ఎస్.బి, రామకిశోర్ అలిపిరి, టిటిడి అండ్ విజిలెన్స్ బృందాలు పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం వాట్సాప్ గవర్నెన్స్

ప్రజాశక్తి - నాయుడుపేట: ఇకపై ప్రజల సమస్యల పరిష్కారానికై ప్రతి శుక్రవారం సచివాలయాల సిబ్బంది ద్వారా వాట్సాప్ గవర్నెన్స్, మన మిత్ర కార్యక్రమాలు నిర్వహించబడతాయని, ప్రజలందరూ తప్పక వినియోగించుకోవాలని మండల అభివృద్ధి అధికారి తెలియజేశారు. మండలంలోని 11 సచివాలయాల సిబ్బంది వారికి కేటాయించిన క్లస్టర్లలో ప్రతి శుక్రవారం వాట్సాప్ గవర్నెన్స్–మనమిత్ర కార్యక్రమాలను డోర్ టు డోర్ నిర్వహించాలని ఎంపీడీఒ కె.సురేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ వాట్సాప్ నంబర్ 95523 00009 ను ప్రజలు వినియోగించుకునే విధంగా అవగాహన కల్పించాలని తెలియజేశారు.

బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

సిడిసిఏ కార్యదర్శి మందపాటి సతీష్ యాదవ్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్(సిడిసిఏ) ఆధ్వర్యంలో 14వ తేదీన, 12 సంవత్సరాల లోపు బాలుర క్రికెట్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు సిడిసిఏ కార్యదర్శి మందపాటి సతీష్ యాదవ్ తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ ఎంపిక ప్రక్రియ ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పీలేరు, తిరుపతి, చిత్తూరు 3 జోన్లలో నిర్వహించబడతాయన్నారు. అందులో మదనపల్లి డివిజన్ పీలేరు పిఐఆసి క్రికెట్ నెట్‌లో, తిరుపతి డివిజన్ స్థానిక మంగళం రోడ్డులోని కజారియా టైల్స్ ఎదురుగా ఉన్న సీవీ క్రికెట్ అకాడమీలో, చిత్తూర్ డివిజన్ వారికి పోలీస్ గ్రౌండ్‌లో సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన క్రికెట్ క్రీడాకారులు వారి డివిజన్ పరిధిలో కేటాయించిన స్థలానికి ఉదయం 9 గంటలకు చేరుకోవాలని తెలిపారు. వివరాలకు 8886185559, 9000214966 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

మహిళలకు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: వెంకటగిరి, 24వ వార్డు స్త్రీ శక్తి భవనంలో మెప్మా ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రారంభించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు ఈ శిబిరంలో మహిళలకు వివిధ వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 35 ఏళ్ల పైబడిన మహిళల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ కార్యక్రమంలో మొత్తం 16 రకాల సమగ్ర వైద్య పరీక్షలు ఉచితంగా అందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య బృందం, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో మెలకువలపై శిక్షణ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయ విస్తరణకు, తిరుపతి జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ షణ్ముగం ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ ఫార్మర్ మాస్టర్ ట్రైనర్స్, ఐసిఆర్‌పికి ఐదు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణ రాస్ కెవికె ఆధ్వర్యంలో తిరుపతి రూరల్ మండలం, వేమూరులో ఆదర్శ రైతు దామా అయ్యప్ప పొలంలో గురువారం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలైన చెరుకు, మామిడి, మల్లెల్, వరి పంటలు, ప్రకృతి వ్యవసాయ మోడల్స్, ఎటిఎం, ఏ గ్రేడ్, పిఎండిఎస్ ప్రత్యక్షంగా చూశారు. పంటల పురుగుల నివారణకు ఉపయోగించే కషాయాలపై బిఆర్సి సెంటర్లో అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం పట్టాభి రెడ్డి, ఎన్ఎఫ్ఏ మధు, నీలమ్మ,150 మంది ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్క్రబ్ టైఫస్‌పై ఆందోళన వద్దు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్క్రబ్ టైఫస్ వైరస్‌కు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, తగిన జాగ్రత్తలు తీసుకుంటే చాలని ప్రాంతీయ ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరిడెంట్ డాక్టర్ వెంకట చలపతి గౌడ్ తెలిపారు. గూడూరు పట్టణంలోని ప్రాంతీ య ఆసుపత్రిలో ఆయన మాట్లాడుతూ.. పురుగు ద్వారా ఈ స్క్రబ్ టైఫస్ వస్తుందని, పొలాలు, ఇతర చోట్ల పనులు చేసేట పుడు గ్లౌజులు వేసుకోవడం, పూర్తిగా కప్పుకుంటే మేలని తెలిపా రు. పురుగు కుట్టిన చోట నల్ల మచ్చ రావడం, నాలుగు రోజుల పాటు జ్వరం ఉంటుందని, వెంటనే దగ్గర్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాంతీయ ఆసుపత్రికి వస్తే మందులు ద్వారా నయం చేయవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్.ఎం.ఓ డాక్టర్ ప్రసన్న, డాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలపై అవగాహన

ప్రజాశక్తి - బియన్ కండ్రిగ: తిరుపతి జిల్లా, బియన్‌కండ్రిగ మండలం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 8,9,10 తరగతుల విద్యార్థులకు గురు వారం వ్యాసరచన, స్పీచ్, డ్రాయింగ్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. అలాగే బాల్యవివాహాల నివారణపై అవగా హన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు రవీంద్రనాథ్,ముని సుబ్రహ్మణ్యం, ప్రధానో పాధ్యాయులు రమణయ్య, ఐసిడిసి సూపర్వైజర్ యమునలు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

భూసార పరీక్షలు చేయించండి

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్, బాలాయపల్లి: వెంకటగిరి డివిజన్, బాలాయపల్లి మండలంలో తిరుపతి జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో గురువారం భూసార పరీక్ష ఫలితాలపై రైతు లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకు లు సౌభాగ్య లక్ష్మి మాట్లాడుతూ భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల వాడకంతో రైతులకు సాగు ఖర్చు తగ్గి, భూసారం కూడా మెరుగుపడుతుందని తెలిపా రు. తద్వారా ఆహార, ఆరోగ్య భద్రత పొందవచ్చన్నారు. బాలాయపల్లి మండల వ్యవసాయాధికారి విజయలక్ష్మి మాట్లా డుతూ రైతు లకు భూసార పరీక్ష ఫలితాలు ఆధారంగా నే ఎరువులు వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వనరు కేంద్రం వ్యవసాయ అధికారులు, సిబ్బంది, బాలాయపల్లి మండల రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల శ్రమను గుర్తిద్దాం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : సంస్థల అభివృద్ధికి మహిళలు మూల స్తంభాలని, వారి శ్రమను గుర్తించి, గౌరవం ఇద్దామని ఏపిఎం టి.ధనంజయ రెడ్డి పేర్కొన్నారు. నారాయణవనం, మండల మహిళా సమాఖ్యలో గురువారం ఎంఎస్ కార్యవర్గాలకు మూడవ రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధనంజయ రెడ్డి మాట్లాడుతూ మహిళా సంఘాలద్వారా వివిధ అంశాలపై అవగాహన పొంది గ్రామ సమస్యలు పరిష్కరించు కుంటారని గేమ్ ద్వారా వివరించారు. నాలుగు రోజుల శిక్షణానంతరం గ్రామస్థాయిలో రెండు రోజులు సంఘ సభ్యుల స్థాయి వరకు వారి భాగస్వామ్యంతో ప్రణాళికలు తయారు చేసుకుని ఆదర్శ గ్రామాలు, ఆదర్శ మండల సమాఖ్యగా నారాయణవనం మండలంను అందరి భాగస్వామ్యంతో దేశంలోనే గొప్పగా తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో, సి సిలు రాజేశ్వరి, నాగేంద్ర రావు, నిమ్మి, అరుణ్ కుమార్, అకౌంటెంట్ మల్లిక, మండల సమైక్య అధ్యక్షులు రాముతులసి, కార్యదర్శి శాంతి, కోశాధికారి జ్యోతి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.